క్లుప్తంగా

లద్నాపూర్‌లో పోచమ్మ బోనాలు



రామగిరి: మండలంలోని లద్నాపూర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు సహకారంతో పోచమ్మ విగ్రహాన్ని పునఃప్రతిష్టించారు. నూతన ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న కదారి అశోక్‌రావు

సుల్తానాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి అశోక్‌రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాకలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులను గెలుపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మనోహర్, శ్రీనివాస్, అజయ్, రాజ్‌కుమార్, నరేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

గోదావరిఖని: బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామగుండం మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాట్యాల మాజీ సర్పంచ్ వేల్పుల సమ్మన్న, సీనియర్ నాయకులు అర్కుల మల్లేశ్, గుమ్ముల తిరుపతి, గోలివాడ రాజేశ్, బోరె శ్రీకాంత్ తదితర నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

సంఘం నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ యాదవ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం సంఘం అడ్‌హక్ కమిటీ నాయకులు ప్రారంభించారు. న్యూమారేడుపాకలోని శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సభ్యత్వ నమోదు ప్రారంభించారు. సంఘం నిర్మాణానికి ప్రతీ యాదవ కుటుంబంలోని సభ్యులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు గడ్డం తిరుపతియాదవ్, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తియాదవ్, కేశవులు యాదవ్, రామగుండం నగర యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రాజేశ్‌యాదవ్, సత్యం, కుమార్ యాదవ్, మల్లయ్య యాదవ్, నాగరాజు, చంద్రశేఖర్‌యాదవ్, కొమురయ్యయాదవ్, కుమార్ యాదవ్, రాజన్న, సాయికృష్ణ, కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్: మానేరు వాగు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ సూచించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వాగు ఉధృతిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలతో వస్తున్న వరద ఉధృతితో ఎల్ఎండీ గేట్లు ఎత్తారని, దీంతో మానేరు వాగు వరద ఉధృతి పెరుగుతోందన్నారు.

'ఖని'లో అడ్వకేట్‌పై దాడి

గోదావరిఖని: స్థానిక జీఎం కాలనీకి చెందిన అడ్వకేట్ గుర్ల రమేశ్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం స్థానిక కొత్తకూరగాయల మార్కెట్ వద్దకు అడ్వకేట్ రమేశ్ రాగా అతనిపై చాంద్‌పాషా, దయాకర్ అనే వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. రమేశ్ తలపై గాయాలు కాగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ సోమవారం కోర్టు విధులు బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

చిన్నవానకే రోడ్లన్నీ జలమయం

- గుంతల్లో నిలిచిన వరదతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- శిథిలావస్థలో డ్రైనేజీలు
- పట్టించుకోని అధికారులు



గుండారంలో రోడ్డుపై పారుతున్న వరద నీరు

కమాన్‌పూర్: కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని రహదారులు జలమయం అవుతున్నాయి. రహదారులపై నిత్యం వరద పారుతుండంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. చిన్నపాటి వర్షం పడిందంటే చాలు రహదారులు మోకాలు లోతువరకు జలమయం అవుతున్నాయి. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్నవారే లేరు. మండలంలోని గుండారం, కిష్టంపల్లె, రొంపికుంట, సిద్దిపల్లె, పెంచికల్‌పేట గ్రామాల్లో ఈ సమస్య నెలకొంది. గుండారంలో మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి గుండారం మీదుగా పిల్లిపల్లె వెళ్లే దారి, కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు నుంచి కిష్టంపల్లె మీదుగా మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారులు చిన్నపాటి వర్షం పడితే చాలు రహదారులపై వరదనీరు పారుతోంది. ఇళ్లలోకి వరదనీరు చేరుతుండంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

డ్రైనేజీలు లేకనే ఇబ్బందులు..

గ్రామాల్లో డ్రైనేజీలు పూర్తిగా శిథిలమై కూలిపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు గతంలో సీసీరోడ్లు, తారు రోడ్లు తవ్వి నల్లా కనెక్షన్ ఇవ్వడంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో రహదారులపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరిస్తా



నూతన ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి లో ఆదివారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పరంగా జర్నలిస్టులకు అందాల్సిన పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లా టెంజు అధ్యక్షుడు కొట్టె సదానందం, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోపి, కోశాధికారి మల్లేశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, సహాయ కార్యదర్శి మల్లేశ్, తిరుపతి, ప్రసాద్, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. మార్కెట్‌చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఉప్పు రాజు, సంపత్, శ్రీనివాస్, భిక్షపతి, ప్రకాశ్ తదితరులున్నారు.

గోదల సేవలు మరువలేనివి

ఎలిగేడు: ఎలిగేడు సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోదల శ్రీనివాసరెడ్డి రైతులకు, కాంగ్రెస్‌కు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. మండలంలోని బుర్హాన్‌మియాపేటలో కీ.శే గోదల శ్రీనివాసరెడ్డి ప్రథమ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ క్యాంపు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోదావరిఖని: సింగరేణి గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం ఆదివారం కొనసాగింది. మాజీ ఉద్యోగులు, ఉద్యోగులు క్యాంపునకు హాజరై వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్‌లోని ఒమెగా ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీకి చెందిన న్యూరాలజీ, కార్డియాలజీ, కిడ్నీ యూరాలజీ వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైసీఎంవో డాక్టర్ అంబిక, ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, డాక్టర్ ప్రసన్నకుమార్, ఒమెగా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

నేడు దేవునిపల్లి జాతర దుకాణాలకు వేలం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో నవంబర్ 2 నుంచి 13 వరకు జరిగే బ్రహ్మోత్సవాల జాతరలో కొబ్బరికాయ, లడ్డు, పులిహోర, పేలాలు, పుట్నాలు విక్రయించేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. రూ.100 చెల్లించి పొందిన దరఖాస్తు పారం నింపి ధరావత్ చెల్లించి 6న జరిగే వేలంలో పాల్గొనాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోపాల్‌యాదవ్

సుల్తానాబాద్: బహుజనుల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాంకు దక్కిందని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గార్ల గోపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కాన్షీరాం వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈనెల 9న జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టె రాజు, అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, ఓదెల మండల అధ్యక్షుడు పల్లె ప్రశాంత్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు మాతంగి శంకర్ ఉన్నారు.

భగవద్గీత ప్రచారం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు రాజు, రాకేశ్, నాగిరెడ్డి, రవి, వేణు, సత్యం, సందీప్, ప్రసాద్, సతీశ్, నరేందర్, ఉమ, సునీత, నాగమణి, రవళి, రష్మిత, సాహిత్, అణు తేజ్, ఆదిత్య, రూపక్, శివాన్షు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లి మానేరు వాగులోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మిక కాలనీపై పట్టింపేది?



కాలనీలో పేరుకుపోయిన చెత్త

- కనీస సౌకర్యాలు కల్పించని యాజమాన్యం

పాలకుర్తి: బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం కంపెనీలో విధులు నిర్వహించే కార్మికులు నివసించే కాలనీ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినవస్తున్నాయి. కంపెనీలో విధులు నిర్వహించే కార్మికులు, వారి కుటుంబసభ్యుల కోసం నిర్మించిన వర్కర్స్ కాలనీలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానిక ఎల్, ఎం, ఈ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారితో పాటు కంపెనీలో నుంచి వచ్చే వరద కాలనీలోని ఇళ్లలోకి చేరుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలనీలో పేరుకుపోయిన చెత్తను సేకరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పందులు, కుక్కలు స్వైర విహారం చేయడంతో దుర్గంధం వ్యాపిస్తోందని కార్మిక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి 'గురుబ్రహ్మ' అవార్డు



సన్మానిస్తున్న మల్లేశం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీహైస్కూల్‌కు చెందిన ప్రభుత్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు గురుబ్రహ్మ అవార్డు పొందారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌కు చెందిన గురూస్, స్టూడెంట్స్, పేరెంట్స్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో ఆదివారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో కూరపాటి సత్యప్రకాశ్‌రావును అవార్డుతోపాటు మెడల్, జ్ఞాపికను వ్యవస్థాపక అధ్యక్షుడు గంగారపు మలేశం బహూకరించారు. సత్యప్రకాశ్‌రావు ఇప్పటి వరకు 26సార్లు రక్తదానం చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అన్నారం హైస్కూల్‌లో 2వేలపైన మొక్కలు నాటి అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్, హెచ్‌ఎంలు సునీత, శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.



నేమ్ బోర్డు కనిపించదేమీ..

ఓదెల: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేట్ సమీపంలో ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డును చెట్లపొదలు కమ్ముకున్నాయి. దీంతో ఊరుపేరు బోర్డు కనిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లే రహదారిలో రైల్వేగేట్ పక్కనగల కొలనూర్ నేమ్‌బోర్డును చెట్లపొదల్లో కమ్ముకున్నాయి. ఊరుపేరు తెలియక రాత్రిపూట వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేసిబ్బంది ఊరుపేరు బోర్డు సరిగా కనబడేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



కమ్మేసిన పచ్చదనం

మంథనిరూరల్: రోడ్డును కమ్మేసిన పచ్చదనం చూపరులను ఆకట్టుకుంటోంది. మంథని మండలం భట్టుపల్లి సమీపంలోని మంథని–కాటారం ప్రధాన రహదారిపై రెండువైపులా చెట్లు ఇలా ఏపుగా పెరిగి పచ్చదనంతో కమ్మేశాయి. ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు ఆహ్లాదంతో పాటు ఆనందం పొందుతున్నారు.



ప్రమాదకరంగా చెట్టు

సుల్తానాబాద్ పట్టణ శివారులో గోదాం సమీపంలో ఉన్న రహదారిపై ఎండిన చెట్టు ప్రమాదకరంగా మారింది. ఎలాంటి ప్రమాదం జరగకముందే రోడ్డుకు పక్కనే ఉన్న ఎండిపోయిన చెట్టును తొలగించాలని వాహనదారులు, కూలీలు, రైతులు రోడ్లు, భవనాలశాఖ అధికారులను కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

కాకా ఆశయ సాధనకు కృషి చేయాలి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



ధర్మారం: పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఎంపీ ఆఫీసు వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/యైటింక్లయిన్‌కాలనీ/ధర్మారం/జూలపల్లి/సుల్తానాబాద్/ముత్తారం/రామగుండం/ఓదెల/ఎలిగేడు: దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి(కాకా) ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఆదివారం కాకా జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ నిరంతరం పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు.

ధర్మారం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మల్లారెడ్డి



అధ్యక్షుడు మల్లారెడ్డి



ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి

ధర్మారం: రెడ్డి సంక్షేమ సంఘం ధర్మారం అధ్యక్షుడిగా కోమటి రెడ్డి మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలోని మహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. గతేడాది సంఘంలోని లావాదేవీలతో పాటు చేసిన వివిధ రకాల సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సభ్యుల ఆమోదంతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సామ ఎల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కమిటీని త్వరలోనే నియమిస్తామని అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, జర్నలిస్టు సంఘం జిల్లా మాజీ సంయుక్త కార్యదర్శి కల్లెం స్వామిరెడ్డి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు యాళ్ల తిరుపతిరెడ్డి, సంఘం సభ్యులు జైపాల్‌రెడ్డి, వన్నెల బాల్‌రెడ్డి, ఎల్లాల రాంరెడ్డి, బద్దం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లి సత్యనారాయణకు ఉత్తమ పీఈటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

సుల్తానాబాద్: విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న సత్యనారాయణను జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశామని జాతీయ అధ్యక్షుడు గంగారపు మల్లేశం అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కరీంనగర్‌లోని వాగేశ్వరి కళాశాలలో నిర్వహించిన గురువులు, స్టూడెంట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో ఆయనకు అవార్డు అందించారు. విద్యార్థులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ పీఈటీ బొల్లి సత్యనారాయణ తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై కుక్కల సంచారం

- ఆందోళనలో ప్రయాణికులు



రామగుండం: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే రామగుండం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పలుచోట్ల శునకాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో రాత్రివేళల్లో ప్రయాణికులు లగేజీలతో ప్లాట్‌ఫాంపై నడుస్తుండగా కుక్కలు వెంటపడడంతో భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని కుక్కలు వివిధ రకాల వ్యాధులతో పైచర్మం ఊడిపోయి మూలుగుతూ ప్లాట్‌ఫాంపై పడుకొని ఉంటున్నాయి. వాటిపై ఈగలు, దోమలతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. రైల్వేశాఖ అధికారులు స్పందించి ప్లాట్‌ఫాం, రైల్వే ప్రాంగణంలోకి కుక్కలు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.